

కొటియా గ్రామాల్లో కొరాపుట్ కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశాలోని కొరాపుట్ కలెక్టర్ కీర్తి వాసన్ మంగళవారం పర్యటించారు. దొరల తాడివలస, నేరళ్ళవలస, దూళిబద్ర, ఎగువ శెంబి, డోలియాంబ గ్రామాల్లో కలెక్టర్ పర్యటించారు. ఒడిశా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. స్థానిక గ్రామాల ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27న జరుగనున్న జగన్నాథ స్వామి రథయాత్ర ఏర్పాట్లు, అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఒడిశా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి వివరించారు.



యోగా చేస్తున్న మంత్రి సంధ్యారాణి, అధికారులు

అంతర్జాతీయ యోగాను విజయవంతం చేయాలి : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్, మక్కువ

ఈ నెల 21న విశాఖ ఆర్కె బీచ్‌లో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మక్కువ మండలం వెంగళరాయ సాగరం వద్ద గల ఏనుగుల కొండ వద్ద మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె జిల్లా అధికారులతో కలిసి యోగాసనాలను చేశారు. విశాఖలో జరిగే యోగా కార్యక్రమంలో స్వచ్ఛందంగా అందరూ పాల్గొనాలని, అవసరమైతే రవాణా సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నేటి పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, అటువంటి మానసిక ఒత్తిడిని తగ్గించి ప్రశాంతతను చేకూర్చేది యోగా మాత్రమేనని వివరించారు. ఏనుగుల కొండ ప్రాంతం చాలా మందికి తెలియదని, ఇటువంటి పర్యాటక ప్రాంతంలో యోగాను నిర్వహించు కోవడం వల్ల ఈ ప్రాంతంలో ఉండే ప్రకృతి అందాలు, ఆహ్లాదకర వాతావరణం ప్రజలకు తెలిసే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలను నిర్వహించి, వాటిని ప్రమోట్ చేసే దిశగా ఏనుగుల కొండ వద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. భవిష్యతులో ఇక్కడ బోటింగ్, ట్రెక్కింగ్ వంటి పలు సదుపాయాలు కల్పిస్తూ, దీన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరచేందుకు ఈ ప్రాంతం అనుకూలమని అన్నారు. జిల్లాలో యోగాంధ్రను బాగా చేస్తున్నారని, ఇది రోజు వారీ కార్యక్రమాల్లో ఒక భాగం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకుముందు అధికారులతో కలిసి రంగుల బెలూన్లను గాల్లోకి వదలి యోగాంధ్రకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డ్వామా, ఐసిడిఎస్ పీడీలు కె.రామచంద్రరావు, టి.కనకదుర్గ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిపిఒ టి.కొండలరావు, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ బి.సుశీల, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు పెద్ద ఎత్తున విద్యార్థులు, శిక్షకులు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేగులపాడులో యోగాంధ్ర

వీరఘట్టం : మండలంలోని రేగులపాడులో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 21న జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సచివాలయ కార్యదర్శి జి.మధు తెలిపారు. ప్రజలకు పలు రకాల యోగాసనాలు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జనసేన జానీ, బూరి సీతమహాలక్ష్మి, పి.వెంకటరమణ, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొండ : స్థానిక కోట దుర్గ ఆలయంలో మంగళవారం యోగాపై గురూజీ జనార్దన్ రావు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోట దుర్గా ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

పరాయి పంచన చదువులు

- గిరిశిఖర గ్రామాల చిన్నారులకు విద్య అందని ద్రాక్ష
- చదుకోడానికి కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే..

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని మరిపల్లి పంచాయితీ గంగన్నదొర వలస, తోణాం పంచాయతీ మెట్టవలసలో ఒక్కొక్క పాఠశాలకు 50 నుంచి 70 మంది పిల్లలు వరకు ఉన్నారు. వీరందరికీ విద్యా బోధనకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే ఇక్కడ శాశ్వత భవనం లేక ఆ గ్రామంలో ఉండే కొన్ని ఇళ్లల్లోనే గడపల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. గంగన్న దొర వలసలో గత ప్రభుత్వంలో నాడు నేడు కింద రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు ప్రకటించడంతో అక్కడనున్న పాడుబడిన పాఠశాల భవనాన్ని తొలగించారు. అనంతరం పునాదుల వరకు వేసి చుట్టూ ప్రహరీ కూడా నిర్మించి, అనంతరం అలాగే వదిలేశారు. నేటికీ దాని గురించి పట్టించుకునే దాఖలాల్లేవు. ఈ విషయమై గ్రామస్తులు ఎన్నిసార్లు ఎంఇఒకు వినతి పత్రాన్ని అందజేసినా ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులకు ఈ గ్రామానికి వచ్చిన వారికి విన్నవించినా ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని గ్రామస్తులు వాపోతున్నారు.

గ్రామస్తులు చందాలతో నిర్మిస్తున్న మెట్టవలస పాఠశాల

తోణాం పంచాయతీ మెట్టవలసలో దశాబ్దాల కిందట ఆర్‌సిఎం పాఠశాలను క్రిస్టియన్ మిషనరీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ గ్రామం నుండి పదుల సంఖ్యలో ఉపాధ్యాయులను, డాక్టర్లను, ఇంజనీర్లను తయారు చేయడానికి ఎంతో ఉపయోగపడిన ఈ పాఠశాల గత వైసిపి ప్రభుత్వం పాఠశాలల విలీనం కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్‌ను పూర్తిగా తొలగించింది. ఈ పాఠశాల ఉందన్న కారణంతో గ్రామంలో ఏ ప్రభుత్వమూ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం చేపట్టలేదు. ఈ పాఠశాలను తొలగించడంతో ఇక్కడ విద్యార్థులు మూడుకిలోమీటర్ల దూరం ఉన్న తోణాం వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఈ గ్రామస్తులు తమ గ్రామంలో ఎలాగైనా పాఠశాల భవనం ఉండాలన్న సంకల్పంతో గ్రామస్తులంతా ప్రతి ఇంటికీ తలో రూ.500, రూ.1000 చొప్పున చందాలు పోగు చేసుకుని పాఠశాలకు ఒక రేకుల షెడ్డును నిర్మించుకోవడానికి పూనుకున్నారు. గతంలో ఈ పాఠశాలలో చదువుకున్న ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజనీర్లు కొంతమంది భాగస్వాములై ఎక్కువ మొత్తంలో చందాలు వేసుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ప్రభుత్వం ఇప్పటికైనా తమ గ్రామానికి శాశ్వత భవనాలు నిర్మించి ఇక్కడే గిరిజన విద్యార్థులు చదువుకునేందుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చదువు కోసం మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోంది

మా గ్రామంలో ఎన్నో ఏళ్ల నుండి ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో ఇక్కడి నుండి సుమారు మూడు కిలోమీటర్ల దూరం నుండే తోణాం వెళ్లేందుకు విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ శాశ్వత భవన నిర్మించి గిరిజన విద్యార్థులకు సరైన విద్యను అందించాలి. ఇదే సమస్యలపై పలుమార్లు నాటి, నేటి మంత్రులకు వినతులు ఇచ్చినా నేటికీ అవి కారణరూపం దాల్చలేదు. ఇప్పటికైనా శాశ్వతమైన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

కొండగొర్రె ఉదయ్ కుమార్,
ఆదివాసీ గిరిజన వికాస్ పరిషత్ జెంసి ఉపాధ్యక్షులు,
మెట్టవలస.

ప్రతి ఒక్కరికీ చదువును అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ఇందుకు కట్టుబడి ఉందని పాలకులు, అధికారులు ఎప్పుడూ చెబుతున్న విషయమై. అయితే వారి మాటలకు, వాస్తవ పరిస్థితులకు ఎక్కడా పొంతన ఉండడం లేదు. పలుచోట్ల పక్కా భవనాల్లేక చిన్నారులు వరండాల్లోనే, అద్దె ఇళ్లలోనే చదుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని చోట్ల సొంత గ్రామంలో బడిలేక మూడు, నాలుగు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సిన పరిస్థితి. గిరిశిఖర గ్రామాల్లో ఇక చెప్పాల్సిన అవసరమే లేదు. అనేక గ్రామాల్లో శాశ్వత భవనాలు లేకపోగా, సరైన రహదారులు సౌకర్యం లేక చిన్నారులు చదువుకు దూరమై పశువులు కాపరులుగానూ, కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి సాక్ష్యాత్తు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జి.సంధ్యారాణి ఇలాఖలో ఉంటే, మిగిలిన ప్రాంతాల్లో విద్యార్థుల పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. తమ గ్రామాల్లో చిన్నారుల చదువుపట్ల పాలకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన లేదు. దీంతో విద్యార్థులకు చదువు కోసం అవస్థలు తప్పడంలేదు.



గంగదొరవలసలో చందాలు వసూలు చేసుకొని నిర్మిస్తున్న రేకుల షెడ్డు



మెట్టవలసలో ప్రహరీగోడకు పరిమితమైన పాఠశాల భవన నిర్మాణం

ఆరుబయటే చదువులు

గంగదొరవలస పాఠశాలలో సుమారు 70 మంది వరకు పిల్లలు చదువుకుంటున్నారు. వీరందరికీ సరిపడా వసతి కల్పించకపోవడంతో గ్రామంలో గల డిఆర్ డిపో కొంతమందిని, చర్చి బయట నుండే పందిరి కింద కొంతమందికి చదువు చెప్పాలి వస్తుంది. వర్షం పడితే మరింత దారుణంగా పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వాలు మారినా తమ గ్రామాలను కనీసం విద్య కూడా అందించడానికి ముందుకు రాకపోవడం విచారకరం. ఈ విషయాన్ని పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేసినా నేటికీ పట్టించుకోకపోవడం దారుణం.

కొండగొర్రె సూర్యారావు,
పాఠశాల కమిటీ ఛైర్మన్

బహుభాషా ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ మాతృ బహుభాష ఉపాధ్యాయులను 2025-26 విద్యా సంవత్సరంలో తక్షణమే రెన్యువల్ చేసి విధులకు పంపించాలని ఆసంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సవర ఆనందరావు, మర్రి చిట్టిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో అక్షరాస్యత నైపుణ్యాల అభివృద్ధికి పాఠశాల విద్యా వ్యవస్థకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విశిష్ట సేవలందిస్తున్న ఆదివాసీ మాతృబహు భాష ఉపాధ్యాయులకు పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు కావస్తున్నా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. కావున ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులకు తక్షణమే రెన్యువల్ చేసి, ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. గత ఐదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నామని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కనీస అవసరాలు తీర్చుకోలేని పరిస్థితిలో జీవనం గడుపుతూ విధులు నిర్వహిస్తున్నారు. నాడు పదో తరగతి అర్హతతో స్థానిక యువతను ఐటిడిఎ ద్వారా నియమించారు. నేడు బిఎడ్, డిగ్రీ, డైట్ ఉన్నత చదువులు చదివి బోధించడం వల్ల ప్రాథమిక విద్యలో గిరిజన భాషలకు విద్యార్థుల అభ్యసించే భాషకు వంతెనలా ఉపయోగపడుతుందని అన్నారు. కావున పాథమిక విద్యలోనాణ్యత నైపుణ్యత పెరిగిందన్నారు. ఉపాధ్యాయుల్లేని అనేక పాఠశాలలు ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులతోనే నడుపుతున్నారని, దీంతో గ్రామీణ ప్రాంతంలో విద్యార్థుల డ్రాప్ శాతం కూడా తగ్గిందన్నారు. ఇంత విశిష్టమైన సేవలందిస్తున్న తమను తక్షణమే రెన్యూవల్ చేసి సమాన పనికి సమాన వేతనం వేతనాలు చెల్లించేలా అన్ని ఐటిడిఎల పరిధిలో ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శ మన్మధరావు

ప్రతి విద్యార్థీ సమాజాన్ని చదవాలి

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి మన్మధరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థి బడిలో చెప్పే చదువు మాత్రమే చదవడం కాదని, సమాజం గురించి కూడా చదవాలని, సమాజం పట్ల అవగాహన, తెలుసుకోవాల్సిన అవసరం నేటి విద్యార్థులకు ఉందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు అన్నారు. బలిజిపేటలోని పిఎస్ఎన్ కాలేజీలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలు సందర్భంగా మంగళవారం సదస్సు జరిగింది. అనంతరం మన్మధరావు మాట్లాడుతూ ఏం చదువుకున్నావ్ అని కాదు ఎంత జ్ఞానం సంపాదించావు అనేది చాలా విలువైదని అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అణగారిన వర్గాల నుండి వచ్చారని, ఆ రోజుల్లో చదువుకోవడానికి మనకున్న సౌకర్యాలు లేవని, అయినా దేశం మొత్తం గౌరవించే అత్యున్న స్థాయికి ఎంతో కష్టపడి వెళ్లారని అన్నారు. ఆయన భారత రాజ్యాంగాన్ని రచించడానికి ఏర్పాటు చేసిన డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారన్నారు. ఆస్తి, ప్రాథమిక హక్కులు లేకుండా చేసి పశువులు కంటే హీనంగా, కట్టు బానిసలుగా దోపిడీ చేసి, దారుణంగా అణచివేయబడ్డ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా సామాజిక తరగతులకు స్వాతంత్ర అనంతరం భారత రాజ్యాంగం అందరికీ విద్యా హక్కు కల్పించిందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగ రిజర్వేషన్ కల్పించి చట్టం ముందు అందరూ సమానమేనని ప్రాథమిక హక్కులు కల్పించిందన్నారు. అయితే మళ్లీ మన రాజ్యాంగ హక్కులపై దాడి జరుగుతోంది. అందుకే రిపబ్లిక్ డే సందర్భంగా మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి.అఖిల్ మాట్లాడుతూ విద్య రాష్ట్రం హక్కును కేంద్రం లాగేసిందని, ప్రాథమిక విద్యను కూడా కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందన్నారు. ప్రాథమిక విద్యను ముక్కలు చేసేసిందన్నారు. రానున్న విద్యా సంవత్సరం నుంచి వేల ప్రాథమిక పాఠశాలలు, మాధ్యమిక పాఠశాలలు మూసేయడానికి చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైందన్నారు. బిజెపి అనుసరిస్తున్న జాతీయ నూతన విద్యా విధానంలో భాగమే ఈ కుట్ర అని విమర్శించారు. రాష్ట్రాలతో నిమిత్తం లేకుండా కేంద్రం ఏకపక్షంగా చేసిన నిర్ణయాలను రాష్ట్రం అమలు చేయడమే ఈ మార్పుల సారాంశమని, ఇది పచ్చి రాజ్యాంగ వ్యతిరేక చర్య అన్నారు. మనమే ప్రభుత్వ విద్యారంగాన్ని, రాష్ట్రం హక్కులు, లౌకిక ప్రజాతంత్ర రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పార్వతీపురం పట్టణ కమిటీ సభ్యులు రాజేష్, బలిజిపేట మండల నాయకులు సంతోష్, శివ శంకర్, నవీన్, శ్రవంతి, కరిష్మా విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి మహిళా లక్షాధికారి కావాలని, ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామిక వేత్త వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మెప్మా అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. వివిధ రకాల జీవనోపాధుల ద్వారా డబ్బులు సంపాదించే మార్గాలు అనేకం ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకొని మహిళలను లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో ఎపిఎంలు, సిఒలు, ఆర్పీలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలకు జీవనోపాధులను కల్పించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా చేస్తున్న కృషిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మెప్మా అధ్వర్యంలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులతో కొత్త వ్యాపార యూనిట్లను స్థాపించి, వారిని లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూచించారు. యూనిట్ల స్థాపనలో మహిళలు లాభాలు ఆర్జించేలా ఉండాలన్నారు. అలాగే యూనిట్ల ఏర్పాటుకు అవసరమైతే శిక్షణను ఇప్పించాలని సూచించారు. సరుకుల కొనుగోలు, విక్రయాల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని, అందరికీ అందుబాటులో ఉండే ధరల్లో విక్రయించడం ద్వారా, డోర్ డెలివరీ వంటి సదుపాయాలను కల్పించడం ద్వారా వ్యాపారాలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే మహిళా మార్టులు, మొబైల్ మార్టులు, కాఫీ షాపులు వంటి కొత్త ఆలోచనల ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాబాలు పొందవచ్చని వివరించారు. ఇప్పటికే వస్త్ర వ్యాపారాలు, తినుబండారాలు, ఫ్యాన్సీ షాపుల ద్వారా మహిళలు లాభాలను ఆర్జిస్తున్నారని, అయినప్పటికీ వీటికి భిన్నంగా అందరికీ అవసరమయ్యే వ్యాపారాలపై ప్రత్యేక దష్టి సారించాలని అధికారులకు కలెక్టర్ హితవు పలికారు. అనంతరం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై సమీక్షించిన ఆయన ప్రతి ఉద్యోగి సూర్యఘర్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సూర్య ఘర్ యూనిట్ ఏర్పాటుతో 28 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ పొందవచ్చని, ఇందుకు అవసరమైన రుణాలను బ్యాంకు మంజూరు చేయడమే కాకుండా దాదాపు 50 శాతం వరకు సబ్సిడీ కూడా ప్రభుత్వం నుంచి లభిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ముందుగా స్వంత ఇళ్లు కలిగిన మెప్మా ఉద్యోగులు, సిబ్బంది సూర్యఘర్ యూనిట్లను ఏర్పాటుచేసుకొని, మిగిలిన సభ్యులకు అవగాహన కల్పించి, వారు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే మాసానికి ప్రతీ ఉద్యోగి కనీసం 100 యూనిట్లు గ్రౌండింగ్ చేయించాలని, బ్యాంకుల నుంచి సమస్యలుంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో మెప్మా పథక సంచాలకులు జివి చిట్టిరాజు, ఎపిఎంలు, సిఒలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యగూడలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని సుందరయ్య గూడ కొండ ప్రాంతంలో ఏనుగులు సంచరించడంతో గిరిజనులు భయం ఆందోళన చెందుతున్నారు. పంటలు నాశనం చేస్తాయేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఇళ్లలో చొరబడతాయేమోనని భయాందోలన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల సంచార వల్ల వ్యవసాయ చేసుకొనేందుకు పొలాలకు వెళ్లేందుకు వణుకుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల ఈ ప్రాంతం నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోతులు కప్పి ప్రజల ప్రాణాలు కాపాడండి

సిపిఎం ఆధ్వర్యంలో రహదారి గోతిలో నిరసన

ప్రజాశక్తి - కొమరాడ

ఎఒబి సరిహద్దు ప్రాంతమైన పార్వతీపురం నుంచి కూనేరు వరకు గల అంతరాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతులను కప్పి ప్రజల ప్రాణాలు కాపాడాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో గోతుల కప్పాలని కోరుతూ అంతరాష్ట్ర రహదారి చోళ్ల పదం వద్ద సేఫ్ జాకెట్లు వేసుకుని గోతుల్లో ఉన్న నీటిలో వినూతన రీతిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాంబమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో కుమ్మరకుంట రైల్వే గేట్ సమీపంలోనూ. జంఝావతి సెంటర్లోనూ, కోటిపాం బ్రిడ్జి, జడ్పీ హైస్కూల్, ఇందిరా నగరం వద్ద, చోళ పదం దేవాలయం వద్ద, అటు ఒడిశా, ఆంధ్ర సరిహద్దు కునేరు గ్రామం వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రతిరోజు వాహనదారులు ఈ గోతుల్లో వరసపు నీరు ఉండటం వల్ల పడిపోయి అనేక ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. గతంలో వివిధ రూపాల్లో ఆందోళన చేస్తే పెద్ద గోతులు కప్పి, చిన్నవి వదిలేయడం వల్ల ఈరోజు మళ్లీ అవి మొదటికి ఈ గోతులు పరిస్థితి వచ్చే పరిస్థితి ఉందన్నారు. కాబట్టి వెంటనే ఈ గోతులన్నీ పూడ్చి అటు వాహనదారుల, ఇటు ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వెంకటేష్, శివున్నాయుడు, ప్రయాణికులు పాల్గొన్నారు.



గొయ్యి వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు సాంబమూర్తి



గిరి మిత్ర వాహనానికి జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరురూరల్

జిల్లాలోని గిరిజన గ్రామాల్లో ప్రజలకు సికిల్ సెల్ ఎనిమియా, నాణ్యమైన వస్తువుల వాడకంపై ఐటిడిఎ ఆధ్వర్యంలో మండలంలోని ఏనుగుల కొండ వద్ద మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం సికిల్ సెల్ ఎనిమియా లేదని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహనా కల్పిస్తున్నట్టు తెలిపారు. గిరిజనులకు బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. వాహనానికి ఒకవైపు ఎల్ ఈ డి స్క్రీన్స్‌తో వీడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ వాహనం ద్వారా సికిల్ సెల్ ఎనిమియా సోకిన వ్యక్తులతో మనం ఎలా మెలగాలి, ఎటువంటి మందులు వాడాలో మైక్ ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించారు. సికిల్ సెల్ ఎనిమియా ఒక వారసత్వ వ్యాధి. తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందని, పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సికిల్ సెల్ ఎనిమియాకు ప్రస్తుతం పూర్తి స్థాయిలో చికిత్స లేదని, కానీ లక్షణాలను తగ్గించడానికి, సమస్యలను నియంత్రించడానికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వాహనంలో 180 రకాల బలవర్ధకమైన ఆహార పదార్థాలను విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ వాహనం జిల్లాలోని ప్రతి గిరిజన గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు. సికిల్ సెల్ ఎనిమియా సోకిన బాధితులకు ప్రభుత్వం తరపున రూ:10 వేలు ఎలా పొందాల్లో అవగాహన కల్పిస్తారని మంత్రి చెప్పారు. అనంతరం సికిల్ సెల్ ఎనిమియాపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన గిరి చైతన్య వాహనాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ మురళీధర్, సాలూరు ఇన్‌ఛార్జి తహశీల్దార్ వి.రంగారావు, ఎంపిడిఒ కె.పార్వతి, మున్సిపల్ కమీషనర్ ఎస్. జయరాం తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో

స్పృహ తప్పి పడిపోయిన విద్యార్థి

ప్రజాశక్తి - పార్వతీపురం

బలిజిపేట మండలం పలగరలోని గుడివాడ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో ఐదో చదువుతున్న లింగాపు ప్రదీప్ స్పృహ తప్పి పడిపోయాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలను అధికారులు మోడల్ స్కూల్‌గా మార్చారు. దీంతో 3,4,5 తరగతుల విద్యార్థులను పలగరలోని పాఠశాలకు పంపించారు. అయితే ఈ కాలనీలో పాఠశాలను తొలగించొద్దని ఆ కాలనీ వాసులతో పాటు కొట్టిశ కాలనీ వాసులు కూడా పాఠశాల వద్ద ఇటీవల నిరసన తెలిపారు. తాము మడ్డువలస రిజర్వాయర్ ముంపు గ్రామాల నుంచి వచ్చిన నిర్వాసితులమని, గత 20 ఏళ్లుగా గుడివాడ, కొట్టిశ కాలనీలుగా ఏర్పడి సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్నాయని, అప్పటి ప్రభుత్వం నిర్వాసితుల పిల్లల చదువుకు పాఠశాలను నిర్మించిందని తెలిపారు. అప్పట్నుండి తమ పిల్లలు ఇక్కడే చదువుతున్నారని తెలిపారు. వృద్ధులైన తమ తల్లిదండ్రుల వద్ద పిల్లలను ఉంచి తామంతా ఉపాధి కోసం వలసలు వెళ్లిపోతున్నామని, నిర్వాసితులకు అందుబాటులో స్కూల్ ఉండడం తమకు ఎంతో ఉపయోగంగా ఉందని అంటున్నారు. మోడల్ స్కూల్ పేరుతో పలగార ప్రాథమిక స్కూల్‌కు మార్చడం వల్ల మార్గమధ్యలో శ్మశానం, రెండు చెరువులు, పెద్ద అంకలం కాలువ ఉండడంవల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు కలెక్టర్‌కు, డిఇఒకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడంలేదన్నారు. కావున తమ పిల్లలను ఇదే పాఠశాలల కొనసాగిస్తామని తెలిపారు. అయితే పిల్లలు పాఠశాలకు వెళ్లినా, మధ్యాహ్న భోజనం పెట్టడం లేదు. భోజనం లేక పిల్లలు స్పృహ తప్పి పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నిర్వాసితుల కాలనీలోనే స్కూలు ఉంచాలని, అందులోనే తమ పిల్లలకు చదువు చెప్పాలని, మధ్యాహ్నం భోజనం పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు మద్దతు తెలిపారు.



విద్యార్థికి సపర్యలు చేస్తున్న స్థానికులు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రతి గిరిజనునికి, గిరిజన గ్రామానికి అవసరమైన సేవలు, మౌలిక సదుపాయాలు కల్పనే డిఎ జుగా కార్యక్రమం ధ్యేయమని రాష్ట్ర స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని కొత్తవలస గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ పథకం కింద గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యసేవలు, జీవనోపాధులు, కనెక్టివిటీ, ఆర్థిక సాధికారత వంటి కీలక రంగాల్లో అభివృద్ధి చర్యలు చేపట్టబడతాయని తెలిపారు. ఈ పథకం కింద మొదటి దశలో పార్వతీపురం మన్యం జిల్లాలో 165 గిరిజన గ్రామాలను ఎంపిక చేసి, వీటిలో సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. అభివృద్ధి పనులను గ్రామ స్థాయిలో అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 15 నుండి 30 వరకు జిల్లాలోని గ్రామాల్లో ప్రత్యేకంగా అవగాహన, ప్రయోజన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో గిరిజనుల స్థితిగతులపై సర్వేలు నిర్వహించి 14 ప్రధాన ప్రభుత్వ సేవలు/లబ్ధులు గిరిజనులకు అందించనున్నట్టు పేర్కొన్నారు. కావున గిరిజనులు ఈ అవగాహన సదస్సుల్లో పాల్గొని ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పార్వతి, వైద్యులు శివకుమార్, సర్పంచ్, ఎంపీటీసీ, టీడీపీ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

కొమరాడ : మారుమూల గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేసి సమస్యలు లేకుండా గిరిజనులకు అన్ని సేవలు సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. మండలంలోని చినఖేర్జీలో డిఎ జుగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గిరిజనులకు అందుతున్న పథకాలు, సేవలను వివరించారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన ఆదాయ, నివాస, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనారోగ్యంగా ఉన్న పలువురు గిరిజనులకు మలేరియా నిర్ధారణతో పాటు వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర్, హౌసింగ్ ఎఇ రాములు, ఎపిఎం సురేష్ బాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, మెడికల్, సచివాల సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.


పాచిపెంట : ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపిడిఒ పాత్రో


లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

కురుపాం : మండలంలోని గుమ్మలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి డిఎ జుగా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సేవలు, మౌలిక సదుపాయాల కల్పనే డిఎ జుగా ధ్యేయమన్నారు. కార్యక్రమంలో బి. వెంకట్, ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పాచిపెంట : డిఎ జుగా సర్వే ద్వారా ప్రజల వద్దకే సేవలని ఎంపిడిఒ బివిజె పాత్రో అన్నారు. మండలంలోని పణుకువలస, పి.కోనవలసలో డిఎ జుగా గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ డిఎ జుగా సర్వే ద్వారా గుర్తించిన వివిధ రకాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రెండు పంచాయతీల్లో పది ఆధార్ కార్డులు. 20 రైస్ కార్డులు, 6 కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సిడిపిఒ బి.అనంతలక్ష్మి, ఇఒపిఆర్‌డి పి.మల్లేశ్వరరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఎంపిడిఒకు వినతి అందజేస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి బకాయిలు తక్షణమే చెల్లించాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధిహామీ పనులు చేపట్టిన వేతనదారులకు ఆరునెలలుగా బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎంపిడిఒకు వినతిని అందజేశారు. అనంతరం వేణు మాట్లాడుతూ మూడు వారాలుగా నిలిపివేసిన ఉపాధి పనులను కొనసాగించాలని, ఇంతవరకు చేసిన పనులకు ఆరు వారాలుగా బకాయి ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే 200 రోజులు పని దినాలు కల్పించి ఈ రోజు వేతనం 600 రూపాయలు చెల్లించాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో సిపిఎం నాయకులు రెడ్డి లక్ష్మం నాయుడు, గవర వెంకటరమణ, రెడ్డి రమణమూర్తి, మూడడ్ల రాఘవ, రెడ్డి శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి అందజేస్తున్న సిఐటియు నాయకులు

'తల్లికి వందనం' వర్తింపజేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు తల్లికి వందన పథకాన్ని వర్తింపు చేయాలని సిఐటియు ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు కార్మికులు మంగళవారం వినతిని అందజేశారు. తల్లికి వందనం పథకానికి మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆదాయ పరిమితిని మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ. 26లో పేర్కొందని, దీని ఆధారంగా పారిశుధ్య కార్మికులకు తల్లికి వందనం పథకం అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ ఉన్నతాధికారులకు రాసిన లేఖను మంగళవారం స్థానిక కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లుకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ నాయకులు బంకురు సూరిబాబు, పారిశుధ్య కార్మికులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మున్సిపాల్టీలో విజిలెన్స్ అధికారుల దర్యాప్తు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

గత వైసిపి ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2024 ఫిబ్రవరి 10 వరకు నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం మండల, జిల్లా, నియోజకవర్గ స్థాయి పోటీల జరిగిన విషయం తెలిసిందే. ఈ పోటీల నిర్వహణ, నిధుల కేటాయింపుపై రికార్డుల పరిశీలనకు శ్రీకాకుళం జిల్లా విజిలెన్స్ కార్యాలయం నుండి విజిలెన్స్ సిఐ సతీష్, ఎస్ఐ బి.రామారావు, సిబ్బంది మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్ సిహెచ్. వెంకటేశ్వర్లును కలిశారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న అప్పటి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణ జరిగే తీరుపై సంబంధిత కార్యాలయాల్లో రికార్డుల పరిశీలన రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని, అందులో భాగంగా ఈ మున్సిపల్ కార్యాలయానికి వచ్చి పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తామని తెలిపారు.

శ్మశానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని శ్మశానాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పాలకులు, అధికారులు, శ్రద్ధ చూపాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల శ్మశాన వాటిక రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీలో దాదాపు 25 వరకు శ్మశాన వాటికలున్నాయన్నారు. వాటిలో 4,5 తప్ప మిగతావాటిలో రహదారి సౌకర్యం, మౌళిక వసతులేవని అన్నారు. మృతదేహాలను శ్మశాన వాటికకు తీసుకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని, పలు శ్మశాన వాటికలకు రోడ్డు సదుపాయం లేకపోవడంతో కట్టెలు మోసుకెళ్లేందుకు అవకాశం లేని పరిస్థితి దాపురించిందన్నారు. మున్సిపాలిటీలో గల కొన్ని శ్మశాన వాటికల్లో నీటి సదుపాయం, షెడ్డు, రహదారి, ప్రహరీ గోడలు తదితర మౌళిక సదుపాయాల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కౌన్సిలర్లు పట్టుబట్టి శ్మశానవాటికల్లో మౌళిక సదుపాయాలు కల్పనకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.దాలి నాయుడు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయిశ్రీనివాస్, జిల్లా నాయకులు కోలా కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎఎంసి పాలకవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - సాలూరురూరల్

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం బుధవారం వేణుగోపాల స్వామి కోవెల ఆవరణలో జరుగుతుందని రాష్ట్రమంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుండి కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆమె పిలుపునిచ్చారు.

నవిరి కాలనీలో నీటి ఎద్దడి నివారించండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మున్సిపాలిటీ శివారు నిర్వాసితుల కాలనీ అయిన నవిరి కాలనీలో నీటి కొరతను నివారించాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యులు పి.సంగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా తాము నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకోని అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు మంచినీళ్లు అందించాలని కోరారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు గంట జ్యోతి, నారాయణ శెట్టి, పట్ల సింగి పుణ్యవతి, రెడ్డి సూరమ్మ, సామల దమయంతి, తుంపు కుమారి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

పార్వతీపురం టౌన్ : విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి వెళ్లకూడదని జిల్లా ఈగల్ స్క్వాడ్ అధికారులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలు, మరియు వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన నిర్వహించారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం ఇచ్చేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 ఉపయోగం, అవసరం, గోప్యతకు సంబంధించిన అంశాలపై వివరించారు.

ఏడాదిగా కూటమి చేసింది శూన్యం : వైసిపి

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సంక్షేమం, అభివృద్ధి శూన్యమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మంగళవారం వైసీపీ శ్రేణులతో కలిసి వెన్నుపోటు పుస్తకాన్ని కురుపాంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు కానీ గొప్పలు చెప్పుకుంటుందని, ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి జి. సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, రాష్ట్ర వైసీపీ మైనార్టీ సంయుక్త కార్యదర్శి షేక్ నూరేళ్ల, మండల కన్వీనర్ ఐ.గౌరీ శంకర్, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ అన్నాజీ రావు, ఎంపిటిసిలు వి.బంగారు నాయుడు, టీవీఎస్ స్వామియోధులు, నాయకులు ఐ. రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : వెన్నుపోటు పుస్తకావిష్కరణను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ స్వగృహంలో మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ వైసిపి అధ్యక్షులు కనపాక సూర్యప్రకాష్, దుపాడ పాపినాయుడు, కడగల రమణ, కోట అజయ్, బాసూరు కాంతారావు, కె.విజయ్ కుమార్, కిల్లారు మోహన్, దుంపల చిన్ని తదితరులు ఉన్నారు

పార్వతీపురం : వైఎస్ జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం – అన్న పుస్తకాన్ని బలిజిపేట మండల వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణమాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్తు నిర్మిస్తే చంద్రబాబు పాలన వాటిని విధ్వంసం చేయడానికే పరిమితమైందని విమర్శించారు. పుస్తకం ద్వారా గడిచిన ఏడాది పాలనా కాలంలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ఒక అరాచకాన్ని సృష్టించారని అన్నారు. ఈ ఏడాది కాలంగా వ్యవస్థల నిర్వీర్యం నుంచి ప్రజాస్వామ్య విధ్వంసం వరకు ఈ పుస్తకంలో ప్రతీ అంశం పొందుపర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తప్పిటి ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు నగిరి పాపారావు, గోళ్ల సత్యనారాయణ, ఎంపిటిసి గుళ్ల ప్రభావతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రంలో వైఎస్ జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం – అనే పుస్తకాన్ని ఆవిష్కరణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ప్రజల కోసం బంగారు భవిష్యత్తు నిర్మిస్తే చంద్రబాబు పాలన వాటిని విధ్వంసం చేయడానికే పరిమితమైనది అన్నారు. వైఎస్ జగన్ పాలన అంటే నమ్మకం గుర్తుకు వస్తే, ఇప్పుడు చంద్రబాబు కూటమి పాలనలో ప్రజలకు పొడిచిన వెన్నుపోటే గుర్తుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ విభాగం ప్రధాన కార్యదర్శి నడిమింటి రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణ, సర్పంచ్లు బొన్నాడ తిరుపతిరావు, కురమాన శ్రీను, ఎంపీటీసీ సభ్యులు అక్కపోలు సింహాచలం, ఏగిరెడ్డి శ్రీను, యాళ్ళ వెంకటరమణ, గుల్ల శంకర్రావు, మండల నాయకులు ఆర్వీ కిషోర్, బుడితి ముకంద, ఎం.మన్మధ, బక్కు సూర్యనారాయణ, వెంకటాపు వెంకట రమణ కార్యకర్తలు పాల్గొన్నారు.


కురుపాంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు


వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

వంతెన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశకిత - సీతానగరం

మండలంలోని స్వర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెన, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర మంగళవారం పరిశీలించారు. కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో మాట్లాడి పనుల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని నిర్దేశించారు. ఈ సందర్భంగా స్థానికులు వంతెనపై లైట్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే ఎల్ఇడి లైట్లు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే వంతెనతో పాటు రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కృష్ణ మూర్తి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

దివంగత నేత భీమవరపు కృష్ణమూర్తి సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం ఎన్.ములగలో జరిగిన కృష్ణమూర్తి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా భీమవరపు చిత్ర పటానికి నివాళు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ప్రసాద్, సూర్యనారాయణ, దామోదర్, మండల పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

రావికోనలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని రావికోనలో సర్పంచి కె.రామస్వామి అధ్వర్యంలో మంగళవారం పెదబొండపల్లి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ తన సిబ్బందితో కలిసి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో రంగాలగూడ, బట్టివలస, కొత్తవలస గ్రామాల నుంచి వచ్చిన 75 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఐదుగురికి జ్వరాలు, ఆరుగురికి చర్మవ్యాధులు, నలుగురికి రక్తహీనత, ఇతర సాధారణ వ్యాధులకు చికిత్సలు అందించారు. వర్షాకాలంలో జ్వరాలు, వాంతులు, విరోచనాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంపిహెచ్ ఇఒ టి.వెంకటనాయుడు, సూపర్వైజర్లు జి.శంకర్రావు, జయలక్ష్మి ఆరోగ్య విద్యను అందించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఎ కె.రమేష్, ఎఎన్ఎం ఉష, సిహెచ్ఒ ఊర్మిళ, ఆశాలు పాల్గొన్నారు.

దీక్ష విరమించిన ఆప్కాస్ ఉద్యోగులు

పార్వతీపురం టౌన్ : ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు పొందినప్పటికీ కేవలం 13 వేల జీతంతో జీవితాలు గడుపుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోలేకపోతున్నామంటూ గత 9 రోజులుగా దీక్షకు దిగిన మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు (ఆప్కాస్) ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర హామీతో మంగళవారం రాత్రి దీక్ష విరమించారు. ఎమ్మెల్యే విజయ్ చంద్రను కలిసి తమ గోడు వినిపించడంతో స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు.

ప్రకృతి వ్యవసాయ పంటలు పరిశీలన

ప్రజాశక్తి - గురుగుబిల్లి

మండలంలోని దత్తివలస, చిలకాంలో ఒడిశా నుంచి స్వచ్ఛంద సంస్థ ప్రధాన కో ఆర్డినేటర్ దినేష్ బాలకృష్ణతో సహా మరో 15 మంది రైతులు క్షేత్ర సందర్శన రీజినల్ టెక్నికల్ అధికారి జి.హేమసుందర్ అధ్యక్షతన మంగళవారం జరిగినది. ఈ సందర్భంగా రైతులు సొంతంగా విత్తనశుద్ధికి బీజామృతం తయారు చేయు విధానం, పంటల దిగుబడులకు ఘన, ద్రవ జీవామృతాల తయారీ, వీటివల్ల పంటలకు ఎలాంటి ఉపయోగం, ఎకరాకు ఎంత పరిమాణంలో వేయాలి, కషాయాలు- ద్రావణాలు, పురుగులు -తెగుళ్ల గురించి చర్చించారు. అనంతరం యోగిరెడ్డి శ్రీనివాసరావు పామాయిల్ క్షేత్రాల్లో నవధాన్యాలు వేసి ఏ విధమైన దిగుబడులు వస్తున్నాయని తెలుసుకున్నారు. ఏ గ్రేడ్ నమూనాలో గట్టు వెడల్పు చేసుకుని మునగ, అరటి, చిక్కుడు, అంగారక మొదలగు పంటలు వేసుకుని ఎక్కువ మొత్తంలో ఆదాయం రావడం జరుగుతుందని, ఇంటి అవసరాల తీర్చుకోవడంతో పాటు, కుటుంబ ఆహారభద్రత సాధించినట్టు తెలిపారు. మిగిలిన పరిమాణం మార్కెట్ చేయడం జరుగుతుందని శ్రీనివాసరావు వివరించారు. ఎటిఎం మోడల్ పలు పంటల విధానం చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దినేష్ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, రైతులు ఆచరించే పద్ధతులు, మహిళల పాత్ర ఎక్కువగా ఉండడం సంతోషకరమైన విషయమన్నారు. హేమ సుందర్ మాట్లాడుతూ రీజనల్ పరిధిలోని అన్ని జిల్లాల్లో ప్రకృతి వ్యవసాయ విస్తరణ కార్యక్రమం చురుగ్గా రైతులు తమ క్షేత్రాల్లో నవధాన్యాలు వేసుకొని భూమి సారవంతం చెందడంతో పాటు 365 రోజులు భూమిపై పచ్చగా ఉండేలా నిరంతర పంటలు – ఆదాయం వచ్చేలా కార్యకర్తలు అందుబాటులో ఉండి రైతులతో ఆచరించేలా చేయడం జరుగుతుందన్నారు. పండ్ల తోటల్లో అంతర్ పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, ఆకు కూరగాయలు మొదలగు పంటలు వేసుకోవడం వల్ల రైతులు అదనపు ఆదాయం పొంది ఆర్థిక అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో నార్త్‌కోస్ట్ రీజినల్ పిఇ తరుణ్ ఆదిత్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణ, ఎస్.దేవి ప్రసాద్, కమల, మండల ఇంచార్జి పోలినాయుడు, రైతులు జామి వెంకటనాయుడు, ఎ.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'తో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

రైతులకు సాగు ఖర్చులు తగ్గించి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ అధిక దిగుబడులు సాధించే దుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుం దని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావు అన్నారు. మండలంలోని చిట్టెలబలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించ బడుతుందని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోడు వ్యవసాయంలో గిరిజన రైతులు ఎక్కువగా చిరుధాన్యాలు పండిస్తున్నారని, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా చిరుధాన్యాలకు మంచి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తుందని అన్నారు. చోడి పంటకు కేజీ రూ.49కు పైగా మద్దతు ధర ఉందని కాబట్టి చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని కోరారు. చిరుధాన్యాలు, వరి వంటి విత్తనాలను 90శాతం రాయితీపై గిరిజనులకు అందిస్తున్నామని, ఈ రాయితీలను సద్వినియోగం చేసుకొని పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా నూతన సాంకేతిక సాగులో మెలకువలను తెలుసుకుని సాగు విస్తీర్ణంతో పాటు దిగుబడిని కూడా పెంచాలని కోరారు. గ్రామంలో నలుగురు రైతులు అన్నదాత సుఖీభవ ఈ కేవైసీ చేయించుకోలేదని వారు ఇకెవైసి పూర్తి చేసుకుంటే అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులవుతారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రకృతి సేద్య ఉత్పత్తులకు అధిక ధరలు కల్పిం చాలని అలాగే ప్రకృతి సేద్యానికి కావాల్సిన ముడి సరుకులను కూడా రాయితీపై అందిస్తే పోడు వ్యవసాయపు దిగుబడులు పెంచుకోగలుగుతామని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ కిరణ్ కుమార్, ప్రకృతి సేద్య క్లస్టర్ ఇంచార్జ్ సురేష్ కుమార్, అప్పన్న, రైతులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని అంటిపేట, పనుకుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ రైతులకు గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో భాగంగా బిపిటి – 2846 రకాన్ని సబ్సిడీపై అందజేశారు. ఈ విత్తనం అత్యధిక దిగుబడి వచ్చే రకం. 145 నుండి 150 రోజుల వ్యవధిలో పండుతుంది. 40 నుండి 50 బస్తాల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. అంతేకాక చీడ,పీడలను కూడా తట్టుకుంటుందని తెలిపారు. అలాగే రైతులు, కౌలు రైతులు కార్డులు కోసం వెంటనే విఎఎలను కలవాలని సూచించారు. పిఎండిఎస్ 220 బ్యాగ్‌లను మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు

వీరఘట్టం : పంట సాగులో మెలుకవలు పాటించాలని స్థానిక వ్యవసాయ అధికారి జె.సౌజన్య రైతులకు సూచించారు. మంగళవారం మండలం లోని కె.ఇచ్ఛాపురం, గదబవలస గిరిజన గ్రామాల్లో రైతులతో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడారు. భూసారం పెరగాలంటే ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు జల్లుకోవాలన్నారు. రసాయన ఎరువులకు స్వస్తి పలికి సేంద్రీయ ఎరువులతో పంటలు సాగు చేయాలన్నారు. అధికారులు ఇచ్చే సూచన లు, సలహాలు పాటించి పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు బి.గౌరు నాయుడు, ఆర్.దాలమ్మ, విఎఎలు ఆర్.గుణశేఖర్, కె.లావణ్య, రైతులు పాల్గొన్నారు.


రైతులకు విత్తనాలు అందజేస్తున్న ఎఒ

రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు

మక్కువ : ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు కావాల్సిన విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారిని సిహెచ్ భారతి తెలిపారు. ప్రభుత్వం నిషేధిత హెచ్‌డి కాటన్ విత్తనాలు ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మంగళవారం పనసభద్ర, మార్కొండపుట్టి పంచాయతీల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొలం గట్లుపై వేసుకునే కంది విత్తనాలకు 100శాతం రాయితీ ప్రభుత్వం ఇస్తుందన్నారు. సాలూరు మండలం నుంచి మక్కువకు ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ వ్యవసాయ అధికారిగా పనిచేసిన శ్రీనివాసరావుకు తెర్లాం బదిలీ అయింది.

ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రధానోపాధ్యాయులు నెల్లి సత్యంనాయుడు అన్నారు. మండలంలోని పనుకువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను పాఠశాలలకు విధిగా పంపించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ సమావేశంలో విద్యా కమిటీ చైర్మన్ శివ, ఉపాధ్యాయులు లక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

ఫిర్యాదుపై దర్యాప్తు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణం లోని నిరాశ్రయుల వసతిగృహం నిర్వహణకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్, జూనియర్, అసిస్టెంట్లు తమకు అన్ని విధాలా ఆశ చూపి, ఇబ్బంది పెట్టారని పట్టణానికి చెందిన ఆదర్శ రూరల్ అండ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ యజమాని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్‌కు రవీంద్ర ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు మంగళవారం బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సంబంధిత ఉద్యోగులపై దర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిరాశ్రయుల వసతి గృహానికి సంబంధించిన నిర్వహణ ఆమోదంలో అన్యాయం జరిగిందంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్మించామని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

గుంత వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కురుపాం : మండలంలో బొడ్డమానుగూడలో సోమవారం ఇద్దరు విద్యార్థులు ఇటికిబట్టి గుంత వద్ద చేపల కోసం దిగి మృతి చెందిన సందర్భంగా నీలకంఠపురం ఎస్ఐ ఎ.నీలకంఠపురం మంగళవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతలో నీరు ఎక్కువ ఉండి ప్రమాదం జరిగిన నేపథ్యంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా ఇటువైపు వస్తే హెచ్చరిక బోర్డును చూసి గుంతవైపు వెళ్ళకుండా వెనుతిరిగి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ జి.జయకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో ప్రజలు బెంబేలు

సీతానగరం : మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పలు గ్రామాల్లో ప్రజలతో పాటు ఆవు దూడలను, మేకలను కరవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.